క్లుప్తంగా

భక్తాంజనేయుడికి వెండి కవచం బహూకరణ



స్వామివారికి వెండికవచం అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగర కొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన పరివార ఆలయమైన భక్తాంజనేయస్వామి దేవస్థానం స్వామివారికి ఒంగోలుకు చెందిన అమరా హనుమంత ప్రసాద్, రమాదేవి కుమారులు చక్రధారి, శ్రావ్య మనమడు సహిష్ణు రూ.3.24 లక్షల విలువగల వెండి కవచాన్ని గురువారం బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈసీ టి. సుభద్ర, ఆలయ పండితులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు, సిబ్బంది

కారంచేడు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందితో పాటు, ఆయా ప్రాంతాల ప్రజలు సైతం అప్రమత్తంగా వ్యవహరించాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఉప్పరపాలెం ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు కలుషితం అవుతుంటుందని, ప్రతి ఒక్కరూ కాచి, చల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటి శుద్ధితో అనేక వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. సుమారు 110 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ వీరమ్మ, హెచ్ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్ఓ జయశ్రీ జగదీశ్వరి, మేరి, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లు, సెక్రటరీలకు శిక్షణ

బల్లికురవ: ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికలకు సంబంధించి 2024 సంవత్సరానికి స్థానిక పరిషత్ కార్యాలయంలో సోమ, మంగళ, బుధవారాల్లో 21 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌లు, సెక్రటరీలకు అవగాహనతో శిక్షణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమారెడ్డి గురువారం తెలిపారు. పారిశుద్ధ్య చెత్త నుంచి సంపద కేంద్రాలు జీపీడీపీపై జరిగే అవగాహనకు సర్పంచ్‌లు సెక్రటరీలు విధిగా హాజరు కావాలని కోరారు

విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి



రిజిష్టర్లను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: తల్లి దండ్రులకు దూరంగా ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కన్నబిడ్డల్లా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు గురువారం సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ బుర్లవారి పాలెం పంచాయతీలో నిర్వహిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, ఎంత మంది అధ్యాపక సిబ్బంది, సౌకర్యాలను అందిస్తున్నారనే విషయాలను న్యాయమూర్తి సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి క్లాస్ రూములు, వసతి రూములను పరిశీలించారు. ప్రతి విద్యార్థినితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పాఠశాల బాధ్యతలోనూ అమ్మదే పైచేయి



పేరాల ఏఆర్ఎం హైస్కూల్‌లో పీఎంసీ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



బల్లికురవలో ఎన్నికలను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్ఎస్ఏ ఏఎస్‌వో



వేటపాలెం: కమిటీ సభ్యులకు మద్దతు తెలుపుతున్న పేరెంట్స్



ఇంకొల్లులో ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు

- ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు
- చైర్మన్ పదవుల్లో అధిక శాతం మహిళలే

చీరాల అర్బన్/వేటపాలెం: కుటుంబాన్ని చక్కదిద్దే అమ్మకు మరో అదనపు బాధ్యత అందుకుంది. కుటుంబ బాధ్యతలను నిర్వహించే నేర్పరిగా ఉన్న అమ్మకు ఇంటి బాధ్యతతో పాటు బడి బాధ్యత కూడా అమ్మకే దక్కింది. ఇంటిని, పాఠశాలను రెండు సరైన క్రమంలో నడిపి, వాటిని అభివృద్ధి పరచేందుకు అవకాశం దక్కింది. ఎస్ఎంసీ ఎన్నికల్లో చైర్మన్లుగా ఎన్నికైన వారిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం చీరాల, వేటపాలెం మండలాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఎస్ఎంసీ చైర్మన్లుగా ఎక్కువ మంది మహిళలే ఎన్నిక కావడం, మరికొన్ని చోట్ల ఏకగ్రీవంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ తంతు నడిచింది. అయితే పట్టణ, రూరల్ ప్రాంతాలలో సమస్యాత్మక ఘటనలు జరగలేదు. రెండు సంవత్సరాల తర్వాత ఎన్నికలను నిర్వహించారు. చీరాల మండలంలో ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ మొత్తం 84 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ప్రతి తరగతికి ఎస్ఎంసీలో ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యుల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. గురువారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 84 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగిన 84 పాఠశాలల్లో 56 పాఠశాలలకు మహిళలే చైర్మన్లుగా ఉన్నారు. ఏకగ్రీవంగా 65 పాఠశాలలు కాగా, 19 పాఠశాలలకు ఓటింగ్ నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుడిగా పాఠశాలకు కావాల్సిన కనీస వసతుల కల్పనలోనూ, నూరుశాతం విద్యార్థుల నమోదు పెంచడంలోనూ, స్వచ్ఛపాఠశాల అనగా హరితవనం, మంచినీటి వసతుల కల్పనలోనూ, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యాభివృద్ధి పెంచడంలో కీలకపాత్ర వహిస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్లలో ఎక్కువ శాతం మహిళలే అధికంగా ఉన్నారు. పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఎన్నికలలో పోటీ చేశారు.



బూదవాడ హైస్కూల్‌లో ఎంపికైన పేరెంట్స్ కమిటీ

వేటపాలెం మండల పరిధిలోని 49 ప్రభుత్వం పాఠశాల్లో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు ప్రశాతంగా ముగిసినట్లు ఎంఈఓ పురుషోత్తం తెలిపారు. 34 ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత, ఏనిమిది హైస్కూల్స్‌లో ఎస్ఎంసీ కమిటి ఎన్నికలు నిర్వహించామని తెలిపారు.

ఎస్ఎంసీతో పాఠశాలల బలోపేతం..

బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల/అద్దంకి: ఎస్ఎంసీ కమిటీలు పాఠశాలల బడిఈడు కలిగిన బాలబాలి కలందరిని పాఠశాలలో చేర్పిస్తూ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని బాపట్ల జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏఎస్‌వో శ్రీనివాసరావు కోరారు. గురువారం బల్లికురవ ఉన్నత పాఠశాల కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో జరుగుతున్న ఎన్నికలను ఆయన పర్యవేక్షించారు. బల్లికురవ ఉన్నత పాఠశాలకు చైర్మన్‌గా పావులూరి వీరాస్వామి వైస్ చైర్మన్‌గా కె. విజయ మాధవి తరగతి ముగ్గురు చొప్పున సభ్యుల ఎన్నుకున్నారు. ఈఎన్నికలను ఎంఈవో 2 కె. రమేష్ బాబు, హెచ్ఎం కె. హనుమంతరావు పర్యవేక్షించారు. మండలంలోని 58 పాఠశాలలు ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో 1,2లు వస్రం నాయక్, రమేష్‌బాబు తెలిపారు.

బయటపడిన టీడీపీ నాయకుల మధ్య విబేధాలు..

అద్దంకి పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు బయట పడ్డాయి. మండలంలోని 26 గ్రామాల్లోని 76 జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలను బుధవారం విద్యాశాఖ నిర్వహించింది. ఇందులో 37 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఎన్నికలకు నాలుగైదు రోజులు ముందుగానే అధికార పార్టీకి చెందిన నాయకులు, రెండు వర్గాలుగా చీలి, తమ పక్షంలో పోటీ చేసే చైర్మన్ అభ్యర్థికే ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. విశేషించి పెద్ద నాయకుల మాటను సైతం లెక్క చేయకుండా పలు గ్రామాల్లో టీడీపీకి చెందిన నాయకులు ఇరు వర్గాలుగా చీలి తమకు చెందిన వ్యక్తికే ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు.

కొరిశపాడు మండలంలో గల 35 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి అయ్యాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశామని, చైర్మన్, వైస్ చైర్మన్‌లను ప్రకటించామని ఎంఈవో పున్నయ్య తెలిపారు.

పంగులూరు మండలంలోని 44 పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. మండలంలోని 6 ఉన్నత పాఠశాలలో, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 32 ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు జరినట్లు విద్యాశాఖ అధికారులు కే నాగభూషణం, జి వీరాంజనేయులు తెలిపారు.



యద్దనపూడిలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ



వలపర్లలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్ఎం



పర్చూరులో ఎన్నికలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కారంచేడులో నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎంఈఓ,

పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలి..

కారంచేడు/మార్టూరు/యద్దనపూడి/చినగంజాం: నూతనంగా ఎన్నికైన పాఠశాలల పేరెంట్స్ కమిటీ యాజమాన్యాలు విద్యార్థుల అభివృద్ధికి కృషిచేయాలని పలువురు ఎంఈవోలు పేర్కొన్నారు. కారంచేడు మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు 33 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు తెలిపారు. 33 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈఎన్నికలు జరిగినట్లు వారు తెలిపారు. ఈ కమిటీలకు కన్వీనర్లుగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉంటారన్నారు.

యద్దనపూడి మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలను ఎంఈఓ చిలుకూరి గోపి ఈ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. మండలంలోని 33 పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా చేతులెత్తి ఎన్నుకునే విధానం చేపట్టారు.

పర్చూరు 38 ప్రాథమిక, 7 జెడ్పీహెచ్ఎస్, 2 గురుకుల, 3 ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో వెంకట్రామయ్య, మార్టూరు మండలంలోని 60 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈఓ వస్రాంనాయక్ తెలిపారు.

చినగంజాం మండలంలో పాఠశాల యాజమాన్యం కమిటీలకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. మండలంలో మొత్తం 38 పాఠశాలకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. వాటిలో 29 ప్రాథమిక పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలో, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు,1 కస్తూరిబా బాలిక విద్యాలయం ఉన్నాయి.

ఇంకొల్లు మండలంలో పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 39 పాఠశాల ఉండగా 30 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు.

వాకర్స్ సేవలు అభినందనీయం

- మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం



మాజీ ఎమ్మెల్యే కరణం చేతులు మీదుగా బియ్యం అందిస్తున్న సభ్యులు

చీరాల రూరల్: అసోసియేషన్ సభ్యులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైస్కూలు క్రీడా మైదానంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బలరామ కృష్ణమూర్తి పాల్గొని ఆయన చేతులు మీదుగా నిర్వహించారు. వాకర్స్ సభ్యులు చెక్కా చెన్న నారాయణ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొడవర్తివారి వీధిలోగల రామాలయానికి రూ. 8,000 విలువ కలిగిన బీరువాను బహూకరించారు. అలానే శ్రీ కృష్ణ గోశాలలోని గోవుల ఆహార నిమిత్తం రూ. 5,000 గోశాల నిర్వాహకులు దేవకి సుబ్బారావుకు అందజేశారు. దీనజన సేవా అన్నదాన సేవా సంఘానికి బియ్యం అందించారు. ఈ సందర్భంగా బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ చీరాల పట్టణంలోని ఇంత పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు వాకర్స్ నిర్వహించడం చాలా మంచిపరిణామమని కొనియాడారు. ఒకవైపు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తూ మరోవైపు సేవా కార్యక్రమాలపై దృష్టి సారించడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, సభ్యులు సుధాకరరావు, పూర్ణచంద్రరావు, నరసింహరావు, నారాయణ, వీరాంజనేయులు, శేషసాయి, చెన్ననారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరిస్తా

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మంత్రికి సమస్యలతో కూడిన పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి: కళాశాలలో తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంత్రి రవికుమార్ సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తమ కళాశాలలో 250 మందికి పైగా ఒకేషనల్ (వృత్తి విద్య) గ్రూప్ విద్యార్థులు ఉన్నారని, వారికి కంప్యూటర్ ల్యాబ్‌లో 10 కంప్యూటర్లు, విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్ హాల్, డెస్కులు, క్యాంపస్‌లో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి అడ్డుగా ఉన్నట్టి తొలగించాలని ప్రిన్సిపాల్ మంత్రి దృష్టికి తెచ్చారు. అదే విధంగా పాత కళాశాల శిధిల గోడలను తొలగించుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళాశాల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

చీరాల అర్బన్: విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. గురువారం చీరాల రూరల్ మండల పరిధిలో విద్యుత్ విజిలెన్స్ ఏపీసీపీడీసీఎల్ జీఎం ఎం.అల్ఫాన్స్, జిల్లా విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, చీరాల ఈఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో సిబ్బంది 37 బృందాలుగా వెళ్లి 2711 సర్వీసులను తనిఖీ చేశారు. అదనంగా లోడ్ వాడుతున్న 122 సర్వీసులకు రూ.3.41లక్షలు, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 15 సర్వీసులకు 0.65 లక్షలు, అక్రమ కేటగిరిలో సర్వీసులను వాడుతున్న 12 సర్వీసులకు రూ.0.36 లక్షల అపరాధ రుసుము విధించారు. చీరాల ఈఈ జాన్ థామస్ మాట్లాడుతూ విద్యుత్‌ను మీటర్ ద్వారానే వాడాలని, అదనపు లోడుకు డబ్బులు చెల్లించి రెగ్యులర్ చేయించుకోవాలన్నారు. 300 యూనిట్లు లోపు విద్యుత్‌వాడుతున్న వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకం కిద ఇంటికి సోలార్ పలకాలను అమర్చుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.78 వేల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తనిఖీల్లో చీరాల విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు, చీరాల డీఈ టి.శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చుట్టాల వద్దకు వచ్చి తిరిగి వెళ్తూ..

మేదరమెట్ల: ముందు వెళ్తున్న మోటారు బైకును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న ఘటన గురువారం ఉదయం మేదరమెట్ల పైలాన్ వద్ద చోటు చేసుకుంది. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపునకు వెళ్తున్న లారీ పైలాన్ ఎక్కుతున్న మోటారు బైకును వెనుక నుంచి ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్‌లో ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి రేపల్లెకు చెందిన మేడా శ్రీనివాసరావుగా తెలస్తోంది. మేదరమెట్లలో చుట్టాల వద్దకు వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిల్లర దొంగల చేతివాటం

వేటపాలెం: చిల్లరి దొంగలు నిత్యం ఎదో ప్రాంతంలో వారి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బుధవారం వస్వే రోడ్డులో గల ఫ్యాన్సీ షాపులోకి దర్జాగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. షాపులో ఉన్న యజమానిని వారికి కావాల్సిన వస్తువుల గురించి అడిగారు. యజమాని ఆ వస్తువులు తీసి ఇవ్వడానికి ప్రయత్నించే సమయంలో షాపులో వారి ముందు ఉన్న కొన్ని వస్తువులను దొంగిలించి బైక్‌లో పెట్టుకొని ఏమీ తెలియనట్లు అక్కడే ఉండిపోయారు. యజమాని వారు అడిగిన వస్తువును తెచ్చి ఇవ్వగా అది వద్దని చెప్పి అక్కడ నుంచి ఉడాయించారు. వారు వెళ్లిన తరువాత షాపు యజమాని సీసీ టీవీ పుటేజీలను పరిశీలించగా షాపులో ముందు వైపు ఉంచిన కొన్ని వస్తువులను యువకులు దొంగిలించినట్లు గుర్తించారు. వారం రోజుల కిందట ఈ షాపు పక్కనే గల కిరాణా షాపును రాత్రి వేళల్లో పగులగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. గ్రామంలో చిల్లర దొంగలు ఎక్కువవడంతో దుకాణాదారులు ఆందోళన చెందుతున్నారు.

నేడు గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు

వేటపాలెం: స్థానిక ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు శనివారం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి స్వాతి కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్త పరీక్షలతో పాటు అవసమైన గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ తీస్తామని చెప్పారు. అవకాశాన్ని మండలం పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన గర్భిణులు సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షల క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి కరణం పరామర్శ



మక్బుల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కరణం

చీరాల: చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన మక్బుల్ కుమార్తె జమీనా ఖురేషి ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటి చదువుతూ కాలేజీలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆమె కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నేడు అద్దంకిలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి శుక్రవారం అద్దంకి పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11.30 గంటల నుంచి పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. అనంతరం 12.30 గంటలనుంచి అద్దంకిలోని కట్టకిందపాలెంలో, సాయంత్రం 7.30 గంటలకు బల్లికురవ మండల కొప్పెరపాలెం గ్రామంలో పలు ప్రైవేటు వేడుకల్లో పాల్గొనన్నట్లు తెలిపారు.

పాఠశాలకు రూ. 35,116 విరాళం

బల్లికురవ: మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికల్లో భాగంగా ఆ గ్రామ నేతలు రూ. 35,116లను విరాళంగా అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం జీ. సత్యకిషోర్ తెలిపారు. చైర్మన్‌గా ఆలకుంట గురవయ్య, వైస్ చైర్మన్‌గా జాష్టి వెన్నెల సభ్యులను ఎక్రగీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పీ. ఆంజనేయులు రూ.25 వేలు, ఏ నాగేశ్వరరావు రూ. 10,116 అందజేసినందుకు హెచ్ఎం, ఉపాధ్యాయులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఇసుక అక్రమ రవాణాపై రివ్యూ నిర్వహిస్తున్న చీరాల ఆర్డీవో

అద్దంకి రూరల్: అద్దంకిలోని గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతాంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అధికారులు సమన్వయంతో అరికట్టాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. గురువారం అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో అక్రమ ఇసుక రవాణాపై ఎంపీడీవో, తహసీల్దార్ ఇతర అధికారులతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాదారులపై నిఘా ఉంచి వారికి అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకానికి వ్యతిరేకంగా ట్రాక్టర్లు, లారీలతో అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కోడుతున్నారన్నారు. ఇక నుంచి ఎప్పటికప్పుడు నిఘావుంచి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అద్దంకి తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ సుధారాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌తో మెరుగైన సేవలు



హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ విజయ అగర్వాల్

చీరాల: అత్యాధునిక వైద్య పరికరాలతో చీరాలలో వైద్యసేవలందిస్తామని అపోలో అపోలో హాస్పిటల్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్, అపోలో హాస్పిటల్స్ గ్రూపు అనుబంధ సంస్థ చీరాలలో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అయిన అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌ను గైనకాలజిస్ట్ డాక్టర్ మాణిక్యమ్మ ప్రారంభించారు. ఈసందర్భంగా అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ సీఈఓ శ్రీరామ్ అయ్యర్, అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్, డీఎంఎస్ డాక్టర్ విజయ అగర్వాల్ మాట్లాడుతూ చీరాలకు అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ రావడంతో ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణ వచ్చినట్లేనన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో నిరంతర వైద్యసేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జనసేన నాయకులు ఆమంచి స్వాములు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులు హాజరయ్యారు.